## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తాం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు

**రామంతాపూర్,మే 2:** రామంతాపూర్ డివిజన్‌లోని శ్రీనివాసపురం, వివేక్‌నగర్, కామాక్షిపురం మీదుగా వెళ్లే ఓపెన్ డ్రైన్ కనెక్టివిటీ కోసం శుక్రవారం కోటి 30 లక్షలతో జరుగుతున్న పనులను డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత, డీఈ నాగమణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్, డివిజన్ నాయకులు బండారు వెంకటరావు, ఉలుగొండ నారాయణదాసు, రవి, అంజయ్య పటేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం



పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**మేడ్చల్, మే 2 :** వేసవిలో విద్యార్థులను వివిధ అంశాల్లో తీర్చిదిద్దేందుకు జిల్లా విద్యాశాఖ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తోంది. గురువారం నుంచి శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 31 పాఠశాలల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక శిబిరం, మేడ్చల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరో శిబిరం నిర్వహిస్తున్నారు. ఒక్కో పాఠశాలలో వంద మంది విద్యార్థులను తీసుకునే అవకాశం ఉంది. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిక్షణనిస్తున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, తబలా, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

**శామీర్ పేట్, మే 2:** వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి హనుమంత్( 48), క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలు కారణంగా శామీర్‌పేట్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. శవ పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



మచ్చ బొల్లారం డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, మే 2:** డ్రైనేజీ సమస్యను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మచ్చబొల్లారంలో ని డ్రైనేజీ సమస్యను పరిశీలించడానికి ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పార్చ్యున్ ఎంక్లేవ్ కాలనీలో డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ఇక్కడ వివిధ హై రైజ్ బిల్డింగ్‌ల సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ ల ద్వారా వదిలిన మురుగునీరంతా రోడ్లపైకి వస్తుందన్నారు. మురుగు నీటి వల్ల ఫార్చ్యూన్ ఎక్లేవ్ కాలనీకి దారి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్నపిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్నా, దవాఖానకు వెళ్లాలన్నా, సీనియర్ సిటిజన్స్ బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు అవుట్ లెట్ సమస్యను పరిశీలించిన తరువాత పైపులైన్ బాక్స్ డ్రైన్ ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రతిపాదనలు చేశారని అన్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ చిన్నారెడ్డి, ఈఈ శ్రీకాంతి , డీఈ రఘు, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్ , డీజీఎం రాజు, మేనేజర్ మల్లికార్జున్, ఏఎం ఓహెచ్ రజిని , ఎలక్ట్రికల్ ఏఈ. లక్ష్మి, వర్క్ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, రమేష్, పరమేష్, లక్ష్మణ్ యాదవ్, పవన్, సందీప్ రెడ్డి, సతీష్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, శ్రీనివాస్, గౌతమ్ రాయ్ , సీతారాజు, భుజంగరావు, సోమోజీ, వినోద్, ఖాదర్ హుస్సేన్, సత్య, మన్మథ నాయర్, రవికాంత్, సంతోష్ ,ఫాతిమా, చిత్ర రఘురాం, వాసవి, రాజు ప్రియ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న కాలనీవాసులు

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**నేరేడ్‌మెట్:** నియోజకవర్గంలోని అన్ని కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వినాయక నగర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు డివిజన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువాచ్చారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి పరశురాంరెడ్డి డివిజన్ అధ్యక్షుడు తుల సీసురేష్, బాలకృష్ణ గుప్త, ఉమేష్, మనోజ్ చారి, ఇస్మాయిల్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష ఏర్పాట్ల పరిశీలన

**ఉప్పల్, మే 2 :** నీట్ పరీక్ష నేపథ్యంలో ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయం-1, 2 కేంద్రాల్లో పరీక్ష ఏర్పాట్లను మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ తహసీల్దార్ వాణి రెడ్డి , ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లు వసతులు తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. పరీక్ష సజావుగా సాగేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏసీపీ చక్రపాణి , తహసీల్దార్ వాణి రెడ్డి

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**కాప్రా, మే 2:** ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త సర్వీసుల విడుదల, వేసవి యాక్షన్ ప్లాన్ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు గోకుల్ నగర్ ఫీడర్ పరిధిలో రాధిక మెయిన్ రోడ్డు నుంచి గుడ్ లక్ కేఫ్ వరకు, ఎల్ఐజీబీఎంఐజీ బి, సీ, ప్రాంతాలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కెవి బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని చైతన్య కాలేజీ ,కమలానగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురు, సత్తిరెడ్డి గల్లి, గవర్నమెంట్ స్కూల్, మహేష్ నగర్,రాఘవేంద్ర హాస్పిటల్ వెనుకవైపు,సీపీఎం ఆఫీస్ పక్కన, మున్సిపల్ ఆఫీస్, అయ్యప్ప స్వామి టెంపుల్ వెనుకవైపు, సౌత్ కమల నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**బోడుప్పల్:** బోడుప్పల్ నగర పాలక సంస్థ సరస్వతీ నగర్ ఫీడర్ పరిధిలోని ఏడు కాలనీలు, వివేకానంద నగర్ ఫీడర్ పరిధిలోని పది కాలనీలు, ఆంజనేయ నగర్ ఫీడర్ పరిధిలోని ఆరు కాలనీలు, బృందావనీకాలనీ పరిధిలోని ఆర్ కాలనీలో, ఇందిరా నగర్ ఫీడర్ పరిధిలోని 8 కాలనీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5:00 వరకు విడతల వారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి

**మేడ్చల్, మే 2:** రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని సైనిక్ స్కూల్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కేంద్రం వరంగల్, కరీంనగర్ లకు సైనిక్ స్కూల్స్ మంజూరు చేసిందన్నారు. కానీ ఇప్పటి వరకు రాష్ట్రంలో నిర్మాణం జరుగలేదన్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూల్స్‌లో స్థానికేతరులుగా గుర్తిస్తూ సైనిక్ స్కూల్స్ సొసైటీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సైనిక్ స్కూల్ పేరెంట్స్ వూటుకూరి మల్లేశం, కొర్వి పోచయ్య ముదిరాజ్, బాపురెడ్డి, బుస్స శ్రీనివాస్ గుప్త, అడ్వకేట్ సత్యనారాయణ, అడ్వకేట్ రాజశేఖర్ రెడ్డి, బి.నాగేష్ తదితరులు ఒక ప్రకటనలో కోరారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల**



మూడుచింతలపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నఎమ్మెల్యే మల్లారెడ్డి,ఎంపీ ఈటల

**శామీర్ పేట్, మే 2 :** ధాన్యం కొలుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రైతులకు సూచించారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్, కేశవరం, జగంగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను సొసైటీలోనే అమ్మాలని రైతులకు సూచించారు. దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులకు అండగా ఉండాలని సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి తో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జగ్గంగూడ గ్రామస్తులు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ భూమి కేటాయించాలను కోరారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్, శామీర్ పేట్ సొసైటీ ఛైర్మన్ మధుకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు జాము రవి, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు నాగరాజు, అఖిలేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణ, శ్రీనివాస్, నరేందర్ గౌడ్, సుధాకర్ నాయక్, నాయకులు మురళీగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కిట్ కొనుగోలుకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రతినిధులు

**ఉప్పల్, మే 2:** ఉప్పల్ న్యూ భరత్ నగర్ నివాసులు కడెం మల్లేష్ కురుమ- యమున కురుమకు కొడుకు పుట్టిన సందర్భంగా వారికి కురుమ సంఘం ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి, పాపకు కేసీఆర్ కిట్ వస్తువులు కొనుగోలు చేయాలని శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు, రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి ,హైకోర్టు న్యాయవాది గొరిగే మల్లేష్ కురుమ, వెలుగుగుట్ట ఆలయ ఛైర్మన్ జన్ని రఘు కురుమ, గొరిగే ఐలయ్య కురుమ, జన్ని సుధ కురుమ, కడెం రాజమ్మ కురుమ, గణేష్ లు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ




కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్(ప్రార్థన)అనంతరం, ఎల్లమ్మబండ చౌరస్తాలోని మిసైల్ మెన్ ఏ పీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి జాతీయ జెండాలను పట్టుకుని. పాకిస్థాన్ మర్దబాద్, డౌన్ డౌన్, హిందూస్థాన్ జిందాబాద్ అని హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ఈ దాడులకు బాధ్యులైన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ముస్లిం యువకులు, మత పెద్దలు భారీగా పాల్గొన్నారు.

– మియాపూర్, మే 2

## మందకృష్ణ మాదిగను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు



30 ఏళ్ల పోరాటం అనంతరం సాధించుకున్న వర్గీకరణను ఆకాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డును అందుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను శుక్రవారం కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి అనుమకొండ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. 30 ఏండ్ల ఎస్సీ వర్గీకరణకై పోరాటం చేసి విజయతీరం చేర్చిన మంద కృష్ణ మాదిగ కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించినందుకు సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్, మాదిగ ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ, దళిత సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్,మే2

## నేడు చీర్యాల్‌కు బస్సు సౌకర్యం ప్రారంభం

**కీసర, మే 2:** సికింద్రాబాద్ నుంచి చీర్యాల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపడంపై ఆ గ్రామ మాజీ సర్పంచ్, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని చీర్యాల్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి ఈసీఐఎల్ మీదుగా సికింద్రాబాద్‌కు ప్రతి రోజూ నాలుగు ట్రిప్పులు ఆర్టీసీ బస్సును నడపండంతో కుషాయిగూడ డిపో మేనేజర్‌కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సును ఈనెల 3వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు చీర్యాల్ గ్రామంలో ప్రారంభించడానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్‌లు విచ్చేస్తున్నారని తెలిపారు. అందుకు గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో రావాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ తెలిపారు.

# డబుల్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పించాలి



చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



జగద్గిరిగుట్ట సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద, నేతలు

**కుత్బుల్లాపూర్, మే 2:** డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో కనీస మౌలిక వసతులను కల్పించలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్, డి.పోచంపల్లి, బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద మౌలిక వసతులైన నీరు, భూగర్భ డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వేసవికాలంలో తాగునీటి సరఫరా సరిగా లేదన్నారు.మరోపక్క డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వసతులు కల్పించలేక ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఇళ్లలోని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తూ వేధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ...ప్రతి పేదవారు ఆత్మ గౌరవంగా బతకాలనే ఆలోచనతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, డిమాండ్‌కు తగ్గ మంచినీటి సరఫరా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారన్నారు. అనంతరం మౌలిక వసతుల కల్పనపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ గాజుల సుజాత, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

### నాయకులు అభివృద్ధి కారకులు కావాలి

జగద్గిరిగుట్ట:తమ ప్రాంతంలో పనులు జరుగుతుంటే పార్టీలకతీతంగా నాయకులు అభివృద్ధి కారకులు కావాలి కానీ నిరోధకులు కాదని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హితవు పలికారు. జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్‌లో రూ.20లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డును శుక్రవారం కార్పొరేటర్ జగన్‌తో కలిసి ప్రారంభించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పరిచామని ప్రస్తావించారు. నగరం కాంక్రీట్ జంగల్‌గా మారి విద్యార్థులకు సరైన వసతులులేని నేపథ్యంలో గత ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసి ఇండోర్ స్టేడియం నిర్మించిందన్నారు. స్థానికులతో మాట్లాడి మెరుగైన మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వేణు యాదవ్, హనుమంతు, సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తి రిమాండ్

**కుత్బుల్లాపూర్, మే 2:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరిపై ఓ వ్యక్తి మద్యం మత్తులో దాడి చేయగా.. ఆ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటనపేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది.సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ హసిం గత నెల 29వ తేదీన సాయంత్రం తన స్నేహితుడితో కలిసి పీబీ ఇంజినీరింగ్ వర్క్స్ కంపెనీ సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనకాల నుంచి సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన కొత్తగూడ సాయి తేజ(31) మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ నడుచుకుంటూ వెళ్తున్న వారిని ఢీకొట్టాడు. అనంతరం సాయితేజ వారిపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బాలానగర్, మే 2:కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఓదార్పునిస్తున్నాయని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయనతోపాటు కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 140 చెక్కులను వారు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెండ్లికి సాయపడేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన గొప్ప సంక్షేమ పథకం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అన్నారు. ఆడపడుచుల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఆసరాగా నిలిచాయని తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో భాగంగా అందజేస్తున్న లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందజేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికీ ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం పట్ల ప్రజలు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి



నూతన కమిటీ ఛైర్మన్,సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం శాలువాతో సన్మానిస్తున్న నాయకులు.గ్రామస్తులు

**పోచారం,మే2:** పోచారం మున్సిపాలిటీలోని వెంకటాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అతి పురాతమైన , ఎంతో మహిమగల ఇక్కడి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి గత కొన్ని సంవత్సరాలుగా ఆశించిన విధంగా అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. ప్రస్తుతం అందరి సహకారంతో ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసి తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయం పేరున ఉన్న భూములను పరిరక్షించి ముందుకు వస్తున్న దాతల సహకారంతో ఈ పురాతన ఆలయాన్ని నూతనంగా నిర్మించే ప్రక్రియ చేపట్టాలని గ్రామస్తును కోరారు. ఇందుకు పూర్తి సహయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎండోమెంట్ శాఖ ఇన్సిస్పెక్టర్ ప్రణీత్ కుమార్,ఈఓ భాగ్యలక్ష్మి,సమక్షంలో నూతన కమిటి ఛైర్మన్ చింతపట్టి సత్తయ్య,సభ్యులు ఎం.ఆంజనేయులు,వి.వెంకటేశ్,కె.లావణ్య,బి .సుధాకర్,వై.వినయ్ శర్మ ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మేముల మహేష్ గౌడ్,కర్రె రాజేష్,సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి,రైతు సొసైటీ డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, ఆలయ కమిటి మాజీ ఛైర్మన్ వేణుగోపాల్,మాజీ కౌన్సిలర్ బలగొని వెంకటేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్,బుర్ర వెంకటేశ్ భక్తులు,వెంకటాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో దంచికొట్టిన వర్షం

**ఘట్‌కేసర్, మే 2:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ తోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో వాన దంచికొట్టింది. ఘట్‌కేసర్ పట్టణంతో పాటు ఎన్ఎఫ్‌సీనగర్, అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఘనపూర్, మర్రిపల్లిగూడలో సాయంత్రం గాలి దుమారం వచ్చి ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డపై వర్షం నీరు నిలవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాలి రావటంతో చెట్లు కూలిపోయాయి.

## రోడ్డు ఆక్రమణల తొలగింపు

దుండిగల్, మే 2: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలను హైడ్రా అధికారులు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి శుక్రవారం తొలగించారు. మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలో పలు ఆక్రమణలను తొలగించిన అధికారులు బౌరంపేట, సింహపురి కాలనీలోని బౌరంపేట-వీఎన్ఆర్ కాలేజ్ రోడ్‌లో రోడ్డును ఆక్రమించి వెలసిన ప్రహరీ గోడలను జేసీబీలతో తొలగించారు. ఇక్కడ ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. కార్యక్రమంలో హైడ్రా సిబ్బందితో పాటు దుండిగల్ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ చివరిలోగా కొత్త మహిళా సంఘాలు

మియాపూర్, మే 2: సర్కిల్ పరిధిలో జూన్ చివరి కల్లా కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సూచించారు. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలు పర్యటించి ప్రతి మహిళను సభ్యురాలిగా చేసేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. చందానగర్ సర్కిల్ టీఎల్ఎఫ్ ప్రత్యేక సమావేశం శుక్రవారం కార్యాలయంలోని సమావేశం మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ వ్యాప్తంగా 3782 నూతన సంఘాల ఏర్పాటును గడువులోగా పూర్తి చేయాలన్నారు. మహిళలలో పొదుపు లక్ష్యాన్ని పెంపొందించాలని మోహన్‌రెడ్డి తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తులు సర్కిల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులైన వారు పెన్షన్ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని మోహన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు

## తులసీనగర్‌ను అభివృద్ధి చేశాం

అల్లాపూర్,మే2: సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ... గత మూడు పర్యాయాలు తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న తులసినగర్ నివాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబియా బేగం సహకారంతో తులసీనగర్‌ను అభివృద్ధి పరచామన్నారు. ప్రతి రెండేండ్లకు ఒక సారి తులసినగర్ సంఘానికి జరిగే ఎన్నికల్లో భాగంగా అధ్యక్షుడిగా తన కాలపరిమితి ముగియడంతో తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. మే 11న తిరిగి మళ్లీ సమావేశం నిర్వహించి.. ఎన్నికల అధికారులను ఎన్నుకొని... వారి ఆధ్వర్యంలో ఎన్నికలకు వెళ్లాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంబయ్య గౌడ్, బండారు, నరేశ్, సూర్యచంద్ర, శేఖర్‌చారి, సత్తమ్మ, విజయ్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు. .